# తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ బీఆర్ఎస్



మల్లెమోనిగూడలో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న ప్రతిమారెడ్డి

పరిగి, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని, ఎక్కడికెళ్లినా ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి కొప్పుల ప్రతిమారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పరిగి మున్సిపల్ పరిధిలోని మల్లెమోనిగూడలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. పరిగి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలనికోరారు. అన్ని వర్గాల మద్దతుతో పరిగిలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మౌలానా, మహిళా విభాగం నాయకురాలు మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తీరిన తాగునీటి కష్టాలు

- నాడు చెలిమ నీరు
- నేడు మిషన్ భగీరథతో గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటి సరఫరా
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో తీరిన రోడ్డు సమస్య
- రూ.2కోట్ల 70లక్షలతో రోడ్డు మంజూరు

కొడంగల్, అక్టోబర్ 30 : మండలంలోని అంగడిరైచూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మాపూర్ గ్రామం అటు నియోజకవర్గ కేంద్రానికి, ఇటు కర్ణాటక శివారులో ఉంది. ఉమ్మడి పాలనలో ఎలాంటి సదుపాయాలు లేక గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. కనీస సౌకర్యాలైన తాగునీటి, రోడ్డు వసతులు అందుబాటులో ఉండేవి కావు. అప్పట్లో గ్రామంలో తాగునీటి సౌకర్యం లేక గ్రామం నుంచి దాదాపు 3 కిలోమీటర్ల దూరం కొండ, గుట్టల్లో పారుతున్న చెలిమ నీటిని తెచ్చుకొని గొంతు తడుపుకొనే వారు. రాత్రి, పగలుతో లేడా లేకుండా ప్రతి ఒక్కరూ తాగునీటి కోసం కొండ, గుట్టల్లో క్యూ కట్టాల్సిన పరిస్థితి ఉండేది. గ్రామ శివారులోని గుట్టల్లో రెండు చోట్ల చెలిమనీరు పారుతూ ఉండేదని, గ్లాసుతో నీటిని తోడుకొని బిందెను నింపుకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక బిందె నిండేందుకు దాదాపు అర్ధగంట పైగానే సమయం పట్టేదని, తప్పని పరిస్థితి కావడంతో ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా నీటిని తెచ్చుకొనే వారమని తెలిపారు. సాధారణ రోజుల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే వేసవిలో మరింత దారుణంగా ఉండేదని, దాంతో పాటు శుభకార్యాలు చేసుకోవాలంటే మరింత ఇబ్బంది పడాల్సి వచ్చేదని తెలిపారు. శుభకార్యాలను చాలా వరకు గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో జరుపుకొనే వారమన్నారు.

**సీఎం కేసీఆర్ చొరవతో తీరిన సమస్య**

గ్రామంలో జఠిలమైన తాగునీటి సమస్య తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితో గ్రామానికి తాగునీటి సమస్య తీరిందని గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించి వందలాది కోట్ల రూపాయలతో దాదాపు 300 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాజలాలను శుద్ధిచేసి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. గ్రామంలో దాదాపు 72 నివాస గృహాలు ఉన్నాయని, అన్ని ఇండ్లకు మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం నల్లా కనెక్షన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



చెలిమ వద్ద నీటిని నింపుకొంటున్న మహిళలు (ఫైల్)

**రూ.2కోట్ల 70లక్షలతో బీటీ రోడ్డు మంజూరు**

ఏండ్ల కాలంగా రోడ్డు కోసం ప్రతి ఒక్క నాయకుడు, అధికారులను ఆశ్రయించినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడి కూడా మా గ్రామాన్ని పట్టించుకోలేదన్నారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక సాధారణ పరిస్థితుల్లో కాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాకు నరకయాతనగా పడ్డామన్నారు. కనీసం గ్రామానికి ఆటో వచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదు. 2018 ఎన్నికల్లో పట్నం నరేందర్‌రెడ్డి ప్రచారం నిమిత్తం గ్రామానికి వచ్చిన సమయంలో రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళితే అప్పట్లోనే రోడ్డుపై చదును పనులు చేయించారు. దాంతో గ్రామానికి కొంత వరకు రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. అంతటితో సరిపోదనే ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి రూ. 2కోట్ల 70లక్షలతో బీటీ రోడ్డును మంజూరు చేసి, రోడ్డు పనుల ప్రారంభానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. రోడ్డు పనులు శంకుస్థాపన చేపట్టిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో మిషన్ భగీరథ నీటి ట్యాంకు

### కేసీఆర్ పథకాలు భేష్..




ఏండ్ల కాలంగా గ్రామంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడేవాళ్లం. తెల్లవారుజాము కాకముందే ఖాళీ బిందెలతో గుట్టలకు పరుగులు తీయాల్సి వచ్చేది. మిషన్ భగీరథ నీరు గ్రామానికి చేరుకొన్న నాటి నుంచి గ్రామంలో తాగునీటి కష్టాలు తీరాయి. మాలాంటి ఎన్నో గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్. మిషన్ భగీరథ పథకం ప్రారంభం నాటి నుంచి యావత్ తెలంగాణలో తాగునీటి గోసకు చమర గీతం పాడింది. నేడు మహిళలు ఇంటి వద్దనే స్వచ్ఛమైన శ్రీశైలం కృష్ణా జలాలను కడవల్లో నింపుకొంటున్నారు. శ్రీశైలం వెళ్లినప్పుడే కృష్ణనీటిని కంటికి అద్దుకునే వాళ్లం నేడు ప్రతి రోజూ మిషన్ భగీరథ నీటితో కృష్ణాజలాలను కంటి అద్దుకోవడమే కాదు, అన్నింటా సౌకర్యాలను తీర్చుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. **- నారాయణరెడ్డి, ధర్మాపూర్, అంగడిరైచూర్, కొడంగల్**

### గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు..



ధర్మాపూర్‌కు రోడ్డు సౌకర్యాలు లేక అన్ని కాలాల్లో ఇబ్బందులు పడేవాళ్లం. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితో మా గ్రామానికి రూ. 2కోట్ల 70లక్షలతో బీటీ రోడ్డు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డు సౌకర్యం వస్తుందో లేదో అనుకున్నాం. గతంలో నాయకులకు మా గోడును వినిపించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. నియోజకవర్గానికి చివరిగా ఉన్న గ్రామం, అభివృద్ధిలో కూడా చివరిగానే నిలిచిపోయింది. ప్రజలకు ప్రధానంగా అవరమై ఈ రెండు సౌకర్యాలు పట్నం నరేందర్‌రెడ్డితోనే సాకారం అయింది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు, ఎంత మంది నాయకులు వచ్చినప్పటికీ మాకు మేలు జరగలేదు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా గ్రామంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించింది.

**- మధుసూదన్ రెడ్డి, ధర్మాపూర్, అంగడిరైచూర్, కొడంగల్**



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి (ఫైల్)

## మోసపూరిత రాజకీయాలు మానుకోవాలి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

దోమ, అక్టోబర్ 30 : కాంగ్రెస్ నాయకులు మోసపూరిత రాజకీయాలు మానుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ అన్నారు. దోమ మండల పరిధిలోని మల్లేపల్లికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ దొడ్ల సాయమ్మ నిరక్ష్యరాలని తెలిపారు. ఆమె కుమారులు గ్రామంలో లేని సమయంలో కాంగ్రెస్ నాయకులు ఆమెతో ఫొటో దిగుదామని చెప్పి కాంగ్రెస్ కండువా కప్పారని తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, ఆమె కుమారులు స్పందించి ఆమెతో పాటు మరికొందరిని బీఆర్ఎస్ చేరడంతో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు ఎవరూ లేని సమయంలో ఇలాంటి మోసపూరిత రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్ల అంజిలయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌నాయక్, డైరెక్టర్ సాయమ్మ కుమారులు పెద్ద నర్సింహులు, చిన్న నర్సింహులు, నాయకులు గుణవర్ధన్, సిద్ధిరాములు, చంద్రానాయక్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కారు గుర్తుకు ఓటేయండి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కోస్గి, అక్టోబర్ 30 : కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి పట్నం నరేందర్ రెడ్డిని గెలిపించాలని ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ నాగులపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం కోస్గి మున్సిపల్ పరిధిలోని 11 వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవడానికి రెండోసారి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరారు. ఆనంతరం ప్రభుత్వ మ్యానిఫెస్టో, కరపత్రాలను కాలనీ వాసులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలేశ్, శ్రీనివాస్, నాయకులు వెంకటేశ్, ఎండీ దోశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

దోమ, అక్టోబర్ 30 : మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రాములమ్మ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తాను అందుబాటులో లేని కారణంగా బీఆర్ఎస్ నాయకుల ద్వారా తక్షణ సాయంగా రూ.5వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేయించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్యముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, వార్డు సభ్యులు లక్ష్మణ్, సాయిలు, గ్రామ పెద్దలు తెలుగు అనంతయ్య, బిచ్చయ్య, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం నిర్మాణానికి విరాళం

కులకచర్ల, అక్టోబర్ 30 : కులకచర్లలో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి తన వంతుగా విరాళం అందజేస్తున్నట్లు జర్నలిస్టు యూనియన్ కులకచర్ల మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో వీరశైవులు నిర్మిస్తున్న శివాలయానికి తనవంతుగా రూ.11వేల విరాళాన్ని సోమవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, సుంకరి వినోద్, రవిచందర్, ప్రకాశ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

## గుండాల పోలింగ్ కేంద్రం పరిశీలన

దోమ, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులతో పాటు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టు దిట్టమైన ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని సీఐ వెంకట రామయ్య అన్నారు. దోమ మండల పరిధిలోని గుండాలలో దోమ ఎస్సై రవిగౌడ్‌తో కలిసి సోమవారం గుండాల గ్రామ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని గ్రామస్తులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బసప్ప, బీఆర్ఎస్ నాయకుడు జగత్‌రెడ్డి పాల్గొన్నారు.